

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	192	221
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 , కనిష్ఠం 16.0



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో..

నేడు ముత్యాల ముగ్గుల పోటీ

నల్లగొండ, జనవరి 6: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలో జరగనున్నాయి. నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పోటీలు కొనసాగుతాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొననున్న ఈ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొంటూ రాష్ట్రస్థాయి పోటీలకు కూడా ఎంపికవుతున్నారు. రంగులతో పోటీలు జరిగేస్థలానికి సకాలంలో చేరుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. పోటీల్లో చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. విజేతలకు మహదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ బహుమతులు అందజేయనుంది.

'నందికొండ' అవిశ్వాసంపై స్టే

● ఆధారాలు చూపాలని హైకోర్టు ఆదేశం

నాగార్జునసాగర్, జనవరి6: నందికొండ మునిసిపాలిటీలో చైర్ పర్సన్ కర్ణ అనూష, వైస్ చైర్మన్ మంద రఘువీర్‌లపై శనివారం చేపట్టనున్న అవిశ్వాస తీర్మాణంపై హైకోర్టు స్టే విధించింది. నందికొండ మునిసిపాలిటీలో మొత్తం 12మంది కౌన్సిలర్లుండగా, అందులో కాంగ్రెస్ కౌన్సిలర్ ఒకరు మృతి చెందారు. ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్లలో నలుగురు కాంగ్రెస్, ఏడుగురు బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం కోరుతూ నల్లగొండలో కలెక్టర్‌కు రెండుసార్లు దరఖాస్తు చేశారు. దీంతో శనివారం అవిశ్వాసం చేపట్టాలని నిర్ణయించారు. దీంతో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లు హైకోర్టును ఆశ్రయించి పిటీషన్ దాఖలుచేశారు. అవిశ్వాసం చేపట్టనున్న తొమ్మిది మంది కౌన్సిలర్లకు సరైన ఆధారాలు చూపాలని కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ వారు చూపలేక పోయారు. హైకోర్టు స్టే విధించడంతో అవిశ్వాస తీర్మాణం వాయిదా పడింది.



● భువనగిరిపై ప్రధాన పార్టీల నజర్ ● ఐదు జిల్లాల్లోని నేతలతో చర్చలు

● నియోజకవర్గాల వారీగా అభిప్రాయ సేకరణ

● అన్ని పార్టీల్లోనూ టికెట్ కోసం పోటాపోటీ

లోక్‌సభ ఎన్నికలకు ప్రధాన పార్టీలు సై అంటున్నాయి. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ బిజీబిజీగా ఉన్నాయి. శాసనసభ ఎన్నికలతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణంలో తీవ్రంగా పెనుతుఫాన్ చెలరేగింది. తెలంగాణ ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన బీఆర్ఎస్‌ను గద్దె దింపి, అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. గతంతో పోలిస్తే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పుంజుకుంది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

మరో నాలుగు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలకు భారత ఎన్నికల కమిషన్ రంగం సిద్ధం చేస్తోంది. ఎన్నికల నిర్వహణపై జిల్లా యంత్రాంగాలతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తోంది. పకడ్బందీగా లోక్‌సభ ఎన్నికలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని, తమ సత్తా చాటాలని తహతహలాడుతున్నాయి. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీతోపాటు బీఆర్ఎస్, బీజేపీలు 10నుంచి 15సీట్లను చేజిక్కించుకోవాలని అధిష్టానాలు వ్యూహాలు రచిస్తున్నాయి. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని ప్రధాన పార్టీల్లోనూ ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. దీంతో అధిష్టానాలకు ఎంపీ అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంపై అన్ని పార్టీలు కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని యాదాద్రిభువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల పరిధిలోని ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి, నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు, జనగామ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. అన్ని పార్టీల నుంచి ఈసారి లోక్‌సభ ఎంపీగా పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీలోని సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై అధిష్టానాలు కసరత్తు చేస్తున్నాయి. ఈ మేరకు పార్టీ సీనియర్ నేతలతో సమావేశాన్ని కూడా నిర్వహించాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను ఎవరిని బరిలో దింపాలన్న అంశంపైనే ప్రధానంగా చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, తీన్మార్ మల్లన్న, తదితరులు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, తెలంగాణ ఉద్యమ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, జనగామ నియోజకవర్గం నుంచి పొన్నాల లక్ష్మయ్య టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. బీజేపీ నుంచి గత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పీవీ.శ్యాంసుందర్‌రావు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, తదితరులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ పడి, త్యాగం చేసిన వారికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్న యోచనలో అధిష్టానాలు ఉన్నాయి. అయితే ఎమ్మెల్యే టికెట్ కోసం పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాలామంది సీనియర్ నేతలు ఆశావహులుగా ఉన్నారు. అభ్యర్థులు మాత్రం తమకే టికెట్ వస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు.

బీజేపీ 10 స్థానాలపై గురి

లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి అనుకూలంగా మలుచుకునేందుకు ఆ పార్టీ అగ్ర నేతలు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ కనీసం 10లోక్‌సభ స్థానాల్లో గెలుపొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈమేరకు ఆ పార్టీ అధిష్ఠానం పెద్దలు రాష్ట్రంలోని సీనియర్ నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. త్వరలోనే పార్లమెంట్ స్థాయిలో కోర్‌కమిటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఎవరిని అభ్యర్థిగా బరిలో దించాలన్న అంశంపై రాష్ట్ర కమిటీతోపాటు బీజేపీ అగ్రనేతలు హాజరై సమాలోచనలు చేశారు. ఈ మేరకు పార్లమెంట్ స్థాయిలోని విస్తారక్‌లతో బీజేపీ ఇన్‌చార్జీ సునీల్ బన్సల్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పార్టీ ముఖ్యనేతలకు దిశా నిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటీవల పార్టీలో చేరిన నేతలతో పాటు, సీనియర్ నేతల కలయికతో బూత్ కమిటీలు, మండల కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో అత్యధిక స్థానాలే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తోంది.

నియోజకవర్గాల వారీగా అభిప్రాయ సేకరణ

ఎంపీ అభ్యర్థులుగా ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీలోని సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలతో పాటు స్థానిక నేతల అభిప్రాయాల సేకరణలో నిమగ్నమవుతున్నాయి. ఈమేరకు లోక్‌సభ ఎన్నికలపై ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు వరుస సమీక్షలు నిర్వహిస్తున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి, ఎంపీ అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానాలు కసరత్తు చేస్తున్నాయి. అయితే అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభిప్రాయ సేకరణలో భాగంగా స్థానిక నేతలకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ వచ్చే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో పార్టీలోని నాయకులందరినీ ఏకం చేసి, ఆర్థికంగా, రాజకీయ పరంగా సమర్థంగా ఉన్న నేతల వైపు అధిష్ఠానాలు మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. పకడ్బందీ వ్యూహంతో ఎన్నికల కదన రంగలోకి దిగేందుకు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రధాన పార్టీలు అడుగులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్న నేతలు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. బీజేపీ నేత శ్యాంసుందర్‌రావు 'విజన్ భువనగిరి' పేరుతో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ సమావేశాలు ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇన్‌చార్జీలను నియమించిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహార కమిటీ(పీఏసీ) ఇటీవల సమావేశాన్ని నిర్వహించింది. రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, దేవరకొండ శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గానికి ఇటీవలి వరకు ఎంపీగా పనిచేసి, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇన్‌చార్జీగా నియమించింది. భువనగిరి నియోజకవర్గం పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం (రంగారెడ్డిజిల్లా), జనగాం(జనగాం జిల్లా) శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. భువనగిరి నియోజకవర్గానికి కూడా ఇటీవల వరకు ఎంపీగా ఉండి, ఇటీవల మంత్రి అయిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపించుకునే బాధ్యతలను ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక కమిటీలు వేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

బీఆర్ఎస్ కసరత్తు

గతంలో బీఆర్ఎస్ సారు..కారు.. పదహారు అన్న నినాదంతో ముందుకు వెళ్లగా...ఈసారి మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. ఉద్యమ పార్టీ అయి ఉండి...చాలా చోట్ల కూడా భారీ ఓట్ల మెజార్టీతో అభ్యర్థులు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో పార్టీ అభ్యరుల ఓటమికి గల కారణాలపై అన్వేషణ ప్రారంభించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ అగ్రనేతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు త్వరలోనే పార్టీలోని మాజీ మంత్రులతో పాటు పొలిట్‌బ్యూరో సభ్యులు, సీనియర్ నేతలతో నియోజజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటుచేస్తోంది. అభ్యర్థులఎంపికపై తెలంగాణ ఉద్యమకారులతోపాటు సీనియర్ నేతలతో సమాలోచనలు చేస్తోంది.

1234881

ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తులు

నల్లగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. గత నెల 28న ప్రారంభమైన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం రెండు సెలవు దినాల మినహా మొత్తం ఎనిమిది రోజుల పాటుసాగింది. ఈ ఎనిమిది రోజుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12,34,881 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నల్లగొండ జిల్లాలో 6,11,853, సూర్యాపేట జిల్లాలో 3,62,203, యాదాద్రి భువనగిరి జి ల్లాలో 2,60,825 దరఖాస్తులను అధికారులు, ప్రజాప్రతినిధులు స్వీకరించారు. దరఖాస్తులో రూపొందించినట్లు రైతు బంధుతోపాటు పింఛన్ పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేయడంతో ఆ పథకాలు మినహా మిగతా పథకాలకు పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లపథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఎవరైనా దరఖాస్తు సమర్పించనట్లయితే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గ్రామసభ, పట్టణసభల్లో దరఖాస్తుల స్వీకరణ ముగిసినప్పటికీ సోమవారం నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లుచేశారు. ఎవరైనా సభలకు హాజరుకాకుండా దరఖాస్తులు ఇవ్వకపోతే, వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇకపోతే ఈ నెల 17వ తేదీ నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఆధార్, రేషన్‌కార్డుల ఆధారంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆ తర్వాత సర్వే అనంతరం స్కీం అమలు చేయనున్నట్లు సమాచారం.



ఉమ్మడి జిల్లాలో 'ప్రజాపాలన' దరఖాస్తులు ఇలా..

తేదీ	యాదాద్రి	సూర్యాపేట	నల్లగొండ	మొత్తం
డిసెంబరు 28	11,132	8,809	38,760	58,701
29	20,475	35,109	38,858	94,442
30	35,474	56,874	78,550	1,70,898
31	సెలవు	-	-	-
జనవరి 1	సెలవు	-	-	-
2	39,033	70,953	93,276	2,03,262
3	42,148	58,271	86,104	1,86,523
4	38,281	51,547	90,462	1,80,290
5	31,319	40,369	78,873	1,50,561
6	42,963	40,271	1,06,970	1,90,204
మొత్తం	2,60,825	3,62,203	6,11,853	12,34,881

ఓడీఎఫ్ ప్లస్ మునిసిపాలిటీలుగా

హాలియా, నల్లగొండ ఎంపిక

హాలియా, రామగిరి, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా హాలియా, నల్లగొండ మునిసిపాలిటీలు ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ)ప్లస్‌గా ఎంపికయ్యాయని హాలియా, నల్లగొండ మునిసిపల్ కమిషనర్లు కందిమళ్ల వీరారెడ్డి, కందుకూరి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మరుగుదొడ్ల సరైన నిర్వహణ విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. గత అక్టోబర్‌లో కేంద్రం నుంచి వచ్చిన బృందం ఆయా మునిసిపాలిటీల్లో మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతకు తీసుకున్న చర్యలను పరిశీలించి ఓడీఎఫ్ ప్లస్ గుర్తింపును ఇచ్చినట్లు చెప్పారు. ఓడీఎఫ్ ప్లస్ గుర్తింపు దక్కడం గర్వంగా ఉందని, అందులో భాగస్వాములైన ప్రతీ ఒక్కరికి అభినందనలు అని చెప్పారు. అదేవిధంగా మునిసిపాలిటీలను ప్లాస్టిక్‌రహితంగా చేసేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆదివాసీ, చెంచు గ్రామాల్లో

మౌలిక వసతుల కల్పన

● ఇన్‌చార్జీ కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న హేమంత్ కేశవ్‌పాటిల్

నల్లగొండ, జనవరి 6: ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ, చెంచు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి సంపూర్ణ అభివృద్ధి చేయనుందని ఇన్‌చార్జీ కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ పథకాన్ని 2023-24 నుంచి 2025-26 వరకు అమలు చేయనున్నట్లు తెలిపారు. 11 కీలక అంశాలపై దృష్టిసారించి మొత్తం రూ.24,104కోట్ల బడ్జెట్‌ను కేంద్రం ప్రకటించిదని తెలిపారు. జిల్లాలోని పెద్దవూర, చందంపేట, గుండ్లపల్లి, నేరడుగొమ్ము మండల పరిధిలోని నెల్లికల్, చిత్రియాల, గోనబోయినపల్లి, కంబాలపల్లి, రేకులవలయం, పొగిళ్ల, తిమ్మాపూర్, గన్నేర్‌పల్లిల గ్రామపంచాయతీ పరిధిలోని చెంచు జనాభాకు ఈ పథకం ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

● ఎస్పీ చందనా దీప్తి



నల్లగొండ, జనవరి 6: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనను విడదల చేశారు. మహిళల రక్షణ కోసం షీటీం బృందాలు పనిచేస్తున్నాయన్నారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, కళాశాలలు, మార్కెట్‌లు, షాపింగ్‌మాల్స్‌ల వద్ద షీటీం బృందాలు పర్యవేక్షణ చేస్తాయని, ఈవ్‌టీజింగ్ చేయకుండా చర్యలు తీసుకోవడంతోపాటు మహిళలకు ధైర్యం కల్పిస్తామన్నారు. మహిళలు డయల్ 100ను వినియోగించుకుని ఫిర్యాదు చేయవచ్చని, అదేవిధంగా పోలీస్‌శాఖ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా

స్వాతి జన్మనక్షత్ర వేడుకలు

సంప్రదాయరీతిలో ధనుర్మాస పర్వాలు



మహాకుంభ కలశాన్ని తీసుకువెళుతున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహా చార్యులు, చిత్రంలో మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు, ఈవో రామకృష్ణారావు తదితరులు

యాదగిరిగుట్ట, జనవరి 6: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం స్వాతి జన్మనక్షత్ర పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు ముఖమండపంలో అష్టోత్తర శతకలశాలను ఏర్పాటు చేశారు. వేదమంత్ర పఠనాలతో హోమ పూజలు జరిపి, గర్భాలయంలోని మూలమూర్తులను అష్టోత్తర శతకలశాలతో అభిషేకించి, సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా స్వామిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నృసింహుడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు, స్థానికులు కొండచుట్టూ గిరిప్రదక్షిణలు చేసి కొండపైన ప్రధానాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ప్రభాతవేళ అష్టభుజి ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో ఆండాళ్ అమ్మవారి తిరుప్పావై పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. మహిళా భక్తుల మంగళనీరాజనాలు పాడారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజా కైంకర్యాలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ స్వామి జన్మనక్షత్రం సందర్భంగా విశేష పూజలు కొనసాగాయి. కాగా స్వామివారి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకుని మాజీ గవర్నర్ ఈఎస్ఎల్.నరసింహన్ దంపతులు అష్టోత్తర శతఘటాభిషేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం వీరికి అర్చకులు చతుర్వేద ఆశీర్వచనం చేశారు. దేవస్థాన ఈవో రామకృష్ణారావు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. లక్ష్మీనృసింహుడిని తెలంగాణ రాష్ట్ర రీజనల్ ఫైర్ అధికారి హరినాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీ శృతికీర్తి దర్శించుకున్నారు. వీరు ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.29,40,458 ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

మట్టపల్లిలో భక్తవత్సలుడికి

గరుడోత్సవం



మఠంపల్లి, జనవరి 6 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని ప్రసిద్ధ క్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శనివారం స్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణంతో పాటు గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు పూర్తిచేశారు. అదేవిధంగా కల్యాణోత్సవంలో భాగంగా మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ తిరువీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించి ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఎన్‌సీఎల్ పరిశ్రమ ప్రెసిడెంట్ చక్రధర్, అర్చకులు పాల్గొన్నారు.

రామాలయంలో లక్ష కుంకుమార్చన

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని రామాలయంలో లక్ష కుంకుమార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి ప్రత్యేకపూజలు కొనసాగాయి. కార్యక్రమంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, రంగాచార్యులు, రాఘవాచార్యులు, నర్సింహాచార్యులు, మురళీచార్యులు, భాస్కరాచార్యులు, పద్మ, గోపాల్, సుశీల, దామోదర్, శ్రీనివాసాచారి, శ్రీనివాస్, సీత పాల్గొన్నారు.

శ్రీరామ పాదుకలకు ప్రత్యేక పూజ



శ్రీరామపాదుకల వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ, జనవరి 6 : త్వరలో అయోధ్య రామాలయంలో వినియోగించే శ్రీరాముడి పాదుకలకు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని హరిహర త్రిశక్తి క్షేత్రంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి పాదుకలతో రథయాత్రగా బయలుదేరిన ప్రత్యేక వాహనం శనివారం వలిగొండకు చేరింది. గోవింద నామస్మరణతో దేవాలయంలోకి పాదుకలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రథయాత్ర బృంద సభ్యుడు బాలాజీ మాట్లాడుతూ మూడేళ్ల క్రితమే ఈ యాత్రను ఆరంభించినట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం శృంగేరీ మఠం జగద్గురువులు పాదుకలకు తొలి పూజలు జరిపిన తదుపరి అయోధ్యలో శ్రీరామ పట్టాభిషేకానికి తరలిస్తున్నట్లు వివరించారు. దేశంలో 16 పవిత్ర నదీ జలాలు, నదీ మృత్తికలను కూడా రామయ్య చెంతకు తీసుకెళ్తున్నామన్నారు. కోటి ఇళ్లలో పూజలు జరిపిన తదుపరి అయోధ్యకు చేరుస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 20న అయోధ్యకు ఈ యాత్ర చేరుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోళ్ల లలితాశ్రీనివాస్, దేవాలయ నిర్వాహకులు గోపాలకృష్ణ, మనోహరి, అర్చకులు దత్తాత్రేయ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య ఆలయ ప్రారంభ కరపత్రాల ఆవిష్కరణ

నార్కట్‌పల్లి, జనవరి 6: అయోధ్యలో రామాలయం ప్రారంభానికి సంబంధించిన కరపత్రాలను శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయోధ్య అక్షింతలను అర్చకులు కారంపూడి వేంకటాచార్యులు, కృష్ణమాచార్యులు భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి, పాల్వాయి భాస్కర్‌రావు, మునుకుంట్ల గణేశ్, గంధం భాస్కర్, బిళ్లకంటి శ్రీకాంత్, బెల్లి దశరథ, పసునూరి పాండురంగయ్య, దోసపాటి వేణు, బండారు రమేశ్, ఓంప్రకాశ్, రాజేశ్వరి పాల్గొన్నారు.



అయోధ్య రామాలయ కరపత్రాలను ప్రదర్శిస్తున్న భక్తులు

చలికి వెచ్చవెచ్చగా





వారం రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రతను తట్టుకోవడానికి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామ యువకులు ఇలా చలిమంటలు వేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిన్నపడిశాలలో ఇటీవల జన్మించిన లేగదూడను చలి నుంచి రక్షించేందుకు రైతు ముస్కు ప్రతాప్‌రెడ్డి గోనె సంచి ఏర్పాటుచేశారు. (శాలిగౌరారం/ అడ్డగూడూరు)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. వేములపల్లి, నార్కట్‌పల్లి, తిప్పర్తిలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.

వేములపల్లి, జనవరి 26 : డ్రైవర్ నిద్రమత్తులో లారీ పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో క్లీనర్ మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ రాజేంద్ర గార్జె, క్లీనర్లు వన్వె ఆశీష్‌బాలు(18), ధోత్రే రాహుల్‌తో కలిసి శుక్రవారం అర్ధరాత్రి నెల్లూరు నుంచి మహారాష్ట్రకు బేకరీ వస్తువులతో బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామశివారులోని గంగదేవరగుట్ట సమీపంలోకి రాగానే డ్రైవర్ రాజేంద్ర నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆశీష్‌బాలు లారీ కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ రాజేంద్ర, మరో క్లీయర్ ధోత్రే రాహుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి చేరుకుని క్రేన్ సహాయంతో లారీని రోడ్డుపైకి తీయించారు. ఆశీష్‌బాలు మృతదేహాన్ని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. క్లీనర్ రాహుల్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



గంగదేవరగట్టు వద్ద బోల్తాపడిన లారీని క్రేన్‌సహాయంతో తీయిస్తున్న పోలీసులు



ఆశీష్‌బాలు మృతదేహం

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి...



రామచంద్రం(ఫైల్)

నార్కట్‌పల్లి, జనవరి 6 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్ఐ రవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అక్కెనపల్లికి చెందిన పాలసంఘం మాజీ చైర్మన్ ముద్దం రామచంద్రం(52) తనకు వరుసకు సోదరుడైన అంజయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై కక్కిరేణి దారిలో వెళ్తున్నారు. అదే దారిలో ఎదురుగా మట్టిలోడుతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలై రామచంద్రం మృతి చెందగా, స్వల్ప గాయాలైన అంజయ్యను నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స అందితుస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

కారు బోల్తాపడిన ఘటనలో..

తిప్పర్తి, జనవరి 6 : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో కారు బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఎన్ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణం బంగారిగడ్డ ప్రాంతానికి చెందిన ఎండీ ఆసీఫ్(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల కిందట తండ్రి మృతిచెందడంతో నిద్రచేసేందుకు తల్లి సుల్తానాను కారులో తీసుకొని హైదరాబాద్‌లోని వారి బంధువుల ఇంటి వద్ద దించి రావడానికి శుక్రవారం ఉదయం వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి బయలుదేరాడు. ఆ క్రమంలో తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామం శివారులోని కల్వర్టు వద్ద రాత్రి 12 గంటల సమయంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆసీఫ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 వాహనం సహాయంతో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఆసీఫ్ భార్య బీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. ధర్మ తెలిపారు. ఆసీఫ్‌కు భార్యతో పాటు ఒక పాప ఉన్నారు.

గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- ఏడుగురు ప్రయాణికులకు తప్పిన ప్రమాదం
- సూర్యాపేట జిల్లా మోతె మండలంలో ఘటన
- ముందు వెళుతున్న వాహనాన్ని దాటుతుండగా ప్రమాదం

మోతె, జనవరి 6: ముందు వెళుతున్న వాహనాన్ని దాటే క్రమంలో ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రహదారి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. శనివారం సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం వద్ద ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు, ప్రయాణికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా డిపోకు చెందిన రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు (టీఎస్ 09 జడ్ 7679) హైదరాబాద్ నుంచి ఖమ్మం బయలుదేరింది. సూర్యాపేటలో కొంతమంది ప్రయాణికులు దిగగా బస్సులో ఏడుగురు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మోతె మండలంలోని మామిళ్లగూడెం గ్రామ సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద ముందు వెళ్తున్న డీసీఎంను ఓవర్‌టేక్ చేయబోయి వెనుకనుంచి ఢీకొంది. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ఏడుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలుకాగా, ఒకరి తలకు గాయమైంది. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణికులను ఖమ్మం జిల్లాకు వెళ్తున్న మరో బస్సులో తరలించారు. బస్సు డ్రైవర్ నాగేంద్రచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఓవర్‌టేక్ చేసే సమయంలో బస్సు బ్రేకులు సరిగా పడకపోవడంతో డీసీఎంను తగిలి రహదారి పక్కగా ఉన్న గుంతలోకి దూసుకెళ్లినట్లు డ్రైవర్ నాగేంద్రాచారి తెలిపారు.





మామిళ్లగూడెం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిన రాజధాని బస్సు, ఘటనలో ధ్వంసమైన బస్సు ముందు భాగం

జీచెన్నారంలో పట్టపగలే చోరీ

కనగల్, జనవరి 6 : నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీచెన్నారం గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఉప్పునూతల పరమేష్ అతడి భార్య సత్తమ్మ రోజువారీగా శుక్రవారం ఇంటికి తాళం వేసి వేర్వేరు పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు భద్రపర్చిన రూ.లక్షన్నర నగదును చోరీచేశారు. కాగా సాయంత్రం నాలుగున్నర గంటలకు కళాశాల ముగించుకుని పరమేష్ కుమార్తె ఇంటికి తిరిగివచ్చింది. ఇంటికి వేసిన తాళం, బీరువా తాళాలు పగలగొట్టి ఉండటంతో విషయాన్ని ఫోన్‌లో తల్లిదండ్రులకు వివరించింది. దీంతో వారు ఇంటికి పరిశీలించి నగదు చోరీ అయినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారాన్ని తెలిపారు. గేదెల కొనుగోలు కోసం తన తల్లి పేరున మూడు రోజుల కిందటే బ్యాంకులో రుణం తీసుకువచ్చి పెట్టానని పరమేష్ వివరించాడు. గేదెల కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తుండగానే దొంగతనం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

కొండమల్లేపల్లి, జనవరి 6 : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో బైక్ చోరీ కేసును పోలీసులు చేధించారు. రెండు బైకులను స్వాధీనం చేసుకుని చోరీకి పాల్పడిన వ్యక్తులను రిమాండ్ చేశారు. శనివారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రాఘవేందర్ రెడ్డి వివరించారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని పాత గ్రామానికి చెందిన బోడ యాదయ్య బుల్లెట్ గత ఏడాది అక్టోబరు 27న చోరీకి గురైంది. ఈ క్రమంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు తిప్పర్తి మండలం ఖాజీరామారం గ్రామానికి చెందిన గుంటికంపు మధుకుమార్‌తో పాటు కోదాడకు చెందిన కారం శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. దీంతో చోరీకి గురైన బుల్లెట్‌తో పాటు నకిరేకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరికి గురైన మరో పల్సర్‌బైక్‌ను కూడా వారి నుంచి స్వాధీనం చేసుకుని, ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వీరబాబు, ఏఎస్ఐ ఆంజనేయులు, హేమానాయక్, గురువారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మరో కేసులో

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో జనవరి 1న రమావత్ ఫూల్‌సింగ్ ఇంట్లో రూ.90వేల నగదు చోరీకిగురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నగదును దొంగలించిన దేవరాయ సత్యనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

ఐదుగురు బాల కార్మికుల గుర్తింపు

తిప్పర్తి, జనవరి 6 : ఆపరేషన్ స్మైల్ బృందం ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో ఐదుగురు బాలకార్మికులను గుర్తించారు. ఆపరేషన్ ముస్కాన్ ఎస్ఐ వీ.శంకరయ్య తన సిబ్బందితో చేసిన తనిఖీల్లో మండలంలోని రామలింగాలగూడెం వద్ద ఉన్న సత్యనారాయణ కాటన్ ఇండస్ట్రీస్‌లో నలుగురు మైనర్లు, తిప్పర్తి మండల కేంద్రంలోని హెచ్‌పీ, పెట్రోల్ బంకులో ఒక బాలకార్మికుడు ఉన్నట్లుగా గుర్తించారు. బాలకార్మికులను తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కాటన్ మిల్లు యజమానులు శివరామ్, శ్రీనివాస్, పెట్రోల్ బంకు నిర్వాహకులు సతీష్‌లపై కేసు నమోదు చేయాలని తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

విద్యార్థిని మిస్సింగ్ కేసు నమోదు

భువనగిరి టౌన్, జనవరి 6 : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం హుస్సేనాబాద్‌కు చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎస్ సుధీర్‌కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన బాలిక సాయంత్రానికి ఇంటికి తిరిగి రాలేదు. శనివారం కూడా వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారని, దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం

కోదాడ రూరల్, జనవరి 6: సూర్యాపేట జిల్లా కోదాడ ఎంపీపీ చింతా కవిత అక్రమాలపై ఎంపీటీసీ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని ఆర్డీవో సూర్యానారాయణ తెలిపారు. ఎంపీపీ కవిత అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేశారని, మండల పరిషత్ జనరల్ ఫండ్ నుంచి నెలకు రూ. 50 వేల చొప్పున సొంత ఖర్చుల కోసం డ్రా చేశారని ఆరోపిస్తూ ఏడుగురు ఎంపీటీసీలు జిల్లా కలెక్టర్ వెంకటరావుకు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో 10 రోజుల్లో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు. ఈ క్రమంలో శనివారం ఆర్డీవో విచారణ చేపట్టారు. మండల పరిషత్‌కు సంబంధించిన తారకరామ కాంప్లెక్స్‌లో అద్దె చెల్లింపులో జరిగిన అవకతవకలపై విచారణ పూర్తి చేశామని, పాత ఎంపీడీవో కార్యాలయం ముందు నిర్మించిన షాపుల నిర్మాణం, షాపులకు సంబంధించిన కిరాయిలను కూడా ఎంపీపీ తీసుకుంటున్నారని ఎంపీటీసీలు చేసిన ఆరోపణలపై కూడా విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని ఆర్డీవో తెలిపారు.

ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదు

నల్లగొండ, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు కట్టుబడిఉందని ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఆరోపణలు సరికాదని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేకల భద్రాద్రి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు కాకముందే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌ను 420 అంటూ ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నాయకులు నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజులలోనే రెండు స్కీంలను ప్రారంభించిందన్నారు. ఈ నెల మరో రెండు స్కీంల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.

శతాధిక వృద్ధులు మృతి

శాలిగౌరారం, జనవరి 6: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఇద్దరు శతాధిక వృద్ధులు శనివారం మృతి చెందారు. శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని పావురాలగూడెం గ్రామానికి చెందిన మద్ది నర్సింహారెడ్డి(104), గురజాల గ్రామానికి చెందిన చామల రమణమ్మ(105) అనారోగ్యంతో మృతి చెందారు. మద్ది నర్సింహారెడ్డి మృతదేహానికి మనవరాలు తలకొరివి పెట్టింది.

దేశం, ధర్మం కోసం జీవితాన్నే త్యాగం చేసిన షణ్ముఖి

రామగిరి, జనవరి 6 : దేశం, ధర్మం కోసం జీవితాన్నే త్యాగం చేసిన వ్యక్తి శ్రీరామోజు షణ్ముఖ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో షణ్ముఖ సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా షణ్ముఖ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షణ్ముఖ తన చిన్ననాటి నుంచే జాతీయ భావజాలంతో దేశం, సంఘం కోసం పనిచేశారన్నారు. ఎమర్జెన్సీ విధించిన సమయంలో నల్లగొండలో కరపత్రాలను రూపొందించి పంచిపెట్టిన మొదటి వ్యక్తి షణ్ముఖ అని అన్నారు. ఆ సమయంలో జైలు జీవితం కూడా గడిపారన్నారు. విద్యార్థి పరిషత్ విభాగంలో పనిచేస్తున్న సందర్భంలో విద్యార్థులను మార్గదర్శకంలో ముందుకు తీసుకురావడానికి అనేక కార్యక్రమాలు చేపట్టారనన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా పనిచేశాడన్నాడు. కార్యక్రమంలో బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్, నూకల నర్సింహారెడ్డి, గార్లపాటి జితేందర్‌కుమార్, పట్టణ నాయకులు భాస్కర్, రాజయ్య, గుండెగాని నాగయ్య, సురిగి మారయ్య, పాలకూరి రవి, స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి, కొల్లోజు సత్యనారాయణ, బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



షణ్ముఖ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆన్‌లైన్ అప్రమత్తంగా చేయాలి : ఆర్డీవో


ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీరాములు

చింతపల్లి, జనవరి 6: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్రమత్తంగా నమోదు చేయాలని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు అన్నారు. చింతపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ప్రతీ గ్రామం నుంచి పెద్దసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రతి ఒక్కరి దరఖాస్తును ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేసి జిల్లా అధికారులకు పంపించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శంషుద్దీన్, డీటీ అర్షద్, ఆర్ఐ యాదయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏపీ సీఎం జగన్‌ది నిరంకుశ వైఖరి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండ, జనవరి 6: ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాదిగలను అవమానించడమే కాకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ అన్నారు. ఏపీ సీఎం వైఖరికి నిరసనగా శనివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరగాల్సిన మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభకు అనుమతి ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మహాసభకు అనుమతి లేదని, కుట్రపూరితంగా వీసీతో కలిసి అవమానించారని అన్నారు. మాదిగలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నందున త్వరలోనే ఏపీ ప్రజలు, మాదిగలు ఆయనకు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మాదిగలను అవమానించిన ఏ ప్రభుత్వాలు నిలబడలేదన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అడెపు నాగార్జున, మేడి శంకర్, స్వామి, యాదయ్య, చిన్న, మోహన్, ఏడుకొండల్, సత్యనారాయణ, రమేష్, శ్రీనివాస్, సహదేవుడు, నాగరాజు, కమలమ్మ, జలేందర్, నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే


కలెక్టర్ రవినాయక్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 6: మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ గోగులోతు రవినాయక్‌ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వెళ్లిన బాలునాయక్ శనివారం మహబూబ్‌నగర్ కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

'నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి'

శాలిగౌరారం, జనవరి 6: శాలిగౌరారం ప్రాజెక్టు మరమ్మతులకు కేటాయించిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాడ సురేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన పలువురు రైతులతో కలిసి తహసీల్దార్ బి.పాల్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. 2021 సంవత్సరంలో శాలిగౌరారం ప్రాజెక్టు ఫీడర్ ఛానల్ మరమ్మతులు, నూతన షట్టర్ల ఏర్పాటు, ప్రాజెక్టు కట్ట మరమ్మతులకు, కట్టపైన బాండు ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసిందన్నారు. తూతూమంత్రంగా కట్ట వెడల్పు చేశారని, నూతన షట్టర్లను ఏర్పాటు చేయలేదన్నారు. నాణ్యత లేని పనులు చేసి నిధులు డ్రా చేసిన కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు, ఐబీ అధికారులపై చర్యలు తీసుకుని డ్రా చేసిన డబ్బులను రికవరీ చేయాలని కోరారు. కలెక్టర్ నిధుల దుర్వినియోగంపై పూర్తి విచారణ చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పడాల వెంకన్న, పడాల సైదులు ఆయకట్టు రైతులు ఉన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు బ్రహ్మాం


బ్రహ్మాం

చింతపల్లి, జనవరి 6: చింతపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ అల్క జైహింద్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి వల్లపు బ్రహ్మాం జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థి బ్రహ్మాం ఇటీవల జరిగిన రాష్ట్ర, జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు బ్రహ్మాం హాజరుకానున్నారు. శనివారం జాతీయస్థాయికి ఎంపికైన బ్రహ్మాం ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయ బృందం సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భానునాయక్, అధ్యాపకులు రామస్వామి, వాసురాం, ప్రభాకర్‌రెడ్డి, అంజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బలపరచాలి

నల్లగొండ, జనవరి 6: రాబోయే ఖమ్మం, వరంగల్ నల్లగొండ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతును బలపరచాలని ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ కోరారు. జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన రాష్ట్రంలో ఏమీ దక్కకుండా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు బొందపెట్టారని అన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోరాడే గొంతుకకు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు చేయాల్సిన విధి విధానాలను నిర్లక్ష్యం చేసి పదవిని అలంకార ప్రాయంగా చేసుకున్నారని ఆయన విమర్శించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ముగిసిన 'ప్రజాపాలన'
- వెల్లువలా వచ్చిన దరఖాస్తులు


హాలియాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


కట్టంగూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు


దాచారంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జడ్పీటీసీలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా, గుర్రంపోడు మండలాల్లో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఉంటుందని తెలిపారు. పార్టీలకతీతంగా అభివృద్ధికి కలిసిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని కోరుకుంటుందని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ ఒక్కనూ అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

● పేదల కోసం ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలం తిమ్మాపురం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, మలిగిరెడ్డి లింగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, రాజారమేష్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

● గుర్రంపోడు మండలంలోని తేరాటిగూడెం, వట్టికోడు, పాల్వాయిలల్లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గాలి సరితరవికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్యయాదవ్, ఎంపీడీవో సుధాకర్, పీఆర్ఏఈ శ్రీనివాసరావు, సర్పంచులు గట్టిపల్లి నిర్మలమణిపాల్‌రెడ్డి, జక్కల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రజాపాలనతో ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని మాడ్గులపల్లి, తిప్పర్తి జడ్పీటీసీలు పుల్లెంల సైదులు, పాశం రాంరెడ్డి అన్నారు. మండలంలోని దాచారం గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులను వారు స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బెల్లి సాలమ్మ, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చందంపేట మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. మండలంలో దరఖాస్తులు 12,333 వచ్చినట్లు ఎంపీడీవో రాములునాయక్ తెలిపారు.

● అర్హులైన ప్రతి ఒక్కరూ ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని మునుగోడు ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్ పేర్కొన్నారు. మండలంలోని జక్కలవారిగూడెం గ్రామంలో దరఖాస్తు స్వీకరించారు. కార్యక్రమంలో త హసీల్దార్ నరేందర్, ఎంపీడీవో భాస్కర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సర్పంచ్ జ క్కుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని ఇస్మాయిల్‌పల్లి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, ఎంపీడీవో సునీత, సర్పంచ్ పులిగిల్ల అంజయ్య, ఎంపీటీసీలు పాలడుగు హరికృష్ణ, యాదగిరి, ఎంపీవో పాల్గొన్నారు.

● అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం ద్వారా ప్రభుత్వ పథకాలు అందిస్తుందని చిట్యాల మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుంకెనపల్లి సర్పంచ్ కక్కిరేణి బొందయ్య, తహసీల్దార్ దశరథ అన్నారు. చిట్యాల మండలం సుంకెనపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వారు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● చండూరు మండలవ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీలకు 10,463 మంది దరఖాస్తులు చేసుకున్నారు. పుల్లెంల గ్రామంలో అత్యధికంగా 1017 దరఖాస్తులు, అత్యల్పంగా తిమ్మారెడ్డిగూడెంలో 183 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో యాకూబ్‌నాయక్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

● ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని శాలిగౌరారం తహసీల్దార్ బి.పాల్‌సింగ్ అన్నారు. శాలిగౌరారంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బట్ట హరిత, ఎంపీటీసీ జోగు సైదమ్మ, ఆర్ఐ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో ప్రజాపాలనకు లబ్ధిదారులు అభయహస్తం కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. మర్రిగూడ మండలంలో 10,152, నాంపల్లి మండలంలో 17,225 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవోలు, తహసీల్దార్లు వెంకటేశ్వర్‌రావు, శేషుకుమార్, శ్రీనివాస్, దేవాసింగ్ తెలిపారు.

● కేతేపల్లి మండలంలో 16 గ్రామాలకు గాను 12,774 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. మొత్తం మండలంలో 10,201 కుటుంబాలకు గాను 12,774 దరఖాస్తులు స్వీకరించినట్లుగా ఆయన తెలిపారు.

● దేవరకొండ మునిసిపాలిటీలో 8493 దరఖాస్తులు వచ్చినట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేసి జిల్లా అధికారులకు పంపించాలన్నారు.

● కనగల్ మండలంలోని కనగల్, పర్వతగిరి, చర్లగౌరారం గ్రామాల్లో ప్రజాపాలన కేంద్రాల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో రవి, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, ఎంపీవో ముజీబుద్దీన్ పీఆర్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని 48 వార్డులు ఉండగా 47,098 దరఖాస్తులు అందినట్లు మునిసిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు తెలిపారు. అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

- మిర్యాలగూడ ఆర్డీవో చెన్నయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చెన్నయ్య

మిర్యాలగూడ అర్బన్, జనవరి 6: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు అర్హులైన గ్రాడ్యుయేటర్లు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో బి. చెన్నయ్య తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ నియోజకవర్గంలోని మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని గ్రాడ్యుయేటర్లకు ఓటు హక్కు కల్పించేందుకు ఈ నెల 15నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. పట్టభద్రులు ఫాం-18లో వివరాలు పొందుపరిచి ఏఈఆర్‌వోలకు ఫిబ్రవరి 6వ తేదీలోపు అందజేయాలని కోరారు. గతంలో ఓటు హక్కు కలిగి ఉన్న గ్రాడ్యుయేటర్లు కూడా దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్హతకు సంబంధించిన పత్రాలపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ తప్పనిసరి ఉండాలని సూచించారు. పట్టభద్రులైన ప్రభుత్వ ఉద్యోగులు వారికి సంబంధించిన విద్యార్హత పత్రాలు, సర్వీస్ తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో ఉన్నట్లుగా సంబంధిత శాఖ ఉన్నతాధికారి ధ్రువీకరించిన పత్రాన్ని దరఖాస్తు ఫాంతో జతపరచాలని సూచించారు. ఫిబ్రవరి 24న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేస్తామని, ఓట్ల నమోదుకు మార్చి 14 మరో అవకాశం కల్పించి ఏప్రిల్ 4న తుది జాబితా ప్రకటించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. డివిజన్‌లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో కోరారు. ఆయన వెంట ఏవో రాధ, సీసీ అఫ్రోజ్ ఉన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు ఈ నెల 20, 21న డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నటు ఆర్డీవో తెలిపారు. అర్హులైన వారు ఓటు హక్కు పొందేందుకు బీఎల్‌వోలకు తమ దరఖాస్తులను విధిగా అందజేయాలని కోరారు. జనవరి 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి ఫిబ్రవరి 8న తుదిజాబితాను విడుదల చేస్తామని ఆర్డీవో తెలిపారు.

● అడవిదేవులపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి 1-11-2023 వరకు డిగ్రీ పట్టా పొందిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైన వారు, నూతనంగా నమోదు కావాల్సిన వారందరూ ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించిన ఎమ్మెల్యే


క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ అర్బన్, జనవరి 6: మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శనివారం ప్రవేశించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో కలిసి పట్టణంలో ర్యాలీగా బయలుదేరి అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఎన్నెస్పీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన ఛాంబర్‌లో కొలువుదీరిన అనంతరం సర్వమత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఆశీర్వచనం చేశారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయం వద్దకు భారీగా చేరుకొని ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రాజకీయాలకతీతంగా నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా పనిచేస్తానన్నారు. ఆర్డీవో చెన్నయ్య, డీఎస్పీ వెంకటగిరి ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ సభ్యుడు పగిడి రామలింగయ్య, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, శాగ జయేందర్‌రెడ్డి, సైదులు, వేణుగోపాల్‌రెడ్డి, పొదిల శ్రీను, స్కైలాబ్‌నాయక్, ఎంపీపీ పుట్టల సునీత కురుపయ్య, కౌన్సిలర్లు శేఖర్‌రెడ్డి, చిలుకూరు బాలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమానికి హరిదాసు కృషి

దేవరకొండ, కొండమల్లేపల్లి, జనవరి 6: బహుజనవాదిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి హరిదాసు ఎంతో కృషి చేశారని, జై భీమ్ నినాదాన్ని ముందుకు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కిందని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య అన్నారు. శనివారం దేవరకొండ, కొండమల్లేపల్లిలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఎల్ఎన్ హరిదాసు 120వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన నేత హరిదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం బహుజన వాదాన్ని తీసుకురావాలని కోరారు.

● దేవరకొండ బస్టాండ్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హరిదాసు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, ప్రజాసంఘాల జేఏసీ నాయకులు అందుగుల వెంకటయ్య, సైదులు, అంజయ్య, నారయ్య, రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో హరిదాసు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న, నాయకులు అంబేద్కర్, ధర్మపురం శ్రీను, ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక విజయ్‌కుమార్, జిల్లా రాములు, పరమేష్, స్వామి పాల్గొన్నారు.

'నెల్లికల్లు' త్వరితగతిన పూర్తిచేస్తాం : జైవీర్‌రెడ్డి

- ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే సమీక్ష
- సమావేశంలో పాల్గొన్న ఎన్నెస్పీ అధికారులు


సమీక్షిస్తున్న మాజీమంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, జనవరి 6: నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సాగర్ హిల్‌కాలనీలో తన నివాసంలో శనివారం రాత్రి ఆయన సాగర్ నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తికావడానికి అవసరమైన నిధులు రానున్న బడ్జెట్‌లో కేటాయిస్తామన్నారు. పదేళ్లుగా పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం పంపుహౌజ్‌ల నిర్మాణ పనులు మాత్రమే జరిగాయని పేర్కొన్నారు. పనులను పూర్తి చేసి కృష్ణపట్టెలో బీడు భూములను సస్యశ్యామలం చేస్తామన్నారు ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టును కూడా పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షా సమావేశంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, సాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లికార్జున్, డీఈలు సుదర్శన్, శ్రీనివాస్, జేఈలు భిక్షమయ్య, కృష్ణయ్య, ఏఈలు సత్యనారాయణ, జనార్ధన్, గోపినాథ్, కేశవ, కరుణాకర్ పాల్గొన్నారు.

చెరువు నీటి వృథాను అరికట్టాలి

మిర్యాలగూడ అర్బన్, జనవరి 6: యాద్గార్‌పల్లి (పందిర్లపల్లి) చెరువు నుంచి నీటి వృథాను అరికట్టేందుకు అధికారులు సమష్టిగా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు కోరారు. పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో చెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటిమట్టం ఆశించిన స్థాయిలో లేదన్నారు. కొందరు రైతులు చెరువు తూములను పగులకొట్టి ప్రస్తుతం నిల్వఉన్న నీటిని వృథా చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. చెరువులో నీటినిల్వ పడిపోతే పట్టణ, పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు తగ్గిపోయి తాగునీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుపై పర్యవేక్షణ లేకపోవడంతో నీటివృథా అధికంగా జరుగుతుందని, దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట సీపీఐ నాయకులు ఎండీ సయీద్, లింగానాయక్, వల్లంపట్ల వెంకన్న, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విప్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి

రామగిరి, జనవరి 6: విప్‌ను ఉల్లంఘించిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని నల్లగొండ మునిసిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ సింబల్‌తో గెలిచి పార్టీ మారిన కౌన్సిలర్లకు విప్ జారీ చేసినట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు.

విప్ పేరిట భయభ్రాంతులకు గురి చేస్తున్నారు : శ్రీనివాస్‌రెడ్డి

విప్ పేరిట బీఆర్ఎస్ నాయకులు కొంతమంది కౌన్సిలర్లను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, లేనప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రొటోకాల్స్, గౌరవ మర్యాదలు, కోర్టు తీర్పులు తెలియని బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు మునిసిపల్ చట్టం పేరుతో కొత్త డ్రామాను స్టార్ట్ చేశారని ఎద్దేవా చేశారు. ఏ ఒక్క కౌన్సిలర్‌కు కూడా విప్ అందలేదని అన్నారు.

సంక్షిప్త సమాచారం...

గుర్రంపోడు: మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నర్సింహ కోరారు. శనివారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గొర్రెల పథకంలో డీడీలు కట్టి ఆరునెలలు గడుస్తున్నా గొర్రెలు ఇవ్వడం లేదని డీడీలు డబ్బులు ఇప్పించాలని కోరారు. రైతుల వరిధాన్యం గతేడాది జూన్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు 12కిలోలు కోత విధించారని, ఆ డబ్బులను ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. తేరాటిగూడెం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

మిర్యాలగూడ టౌన్: ఎమ్మెల్సీ స్థానాన్ని బీసీ సామాజికవర్గానికి కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను పార్టీలు ఓటు బ్యాంకులా వాడుకుంటున్నాయన్నారు. బీసీకి ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించకపోతే వంద మందితో నామినేషన్ వేయిస్తామన్నారు.

● ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను బీసీ సంఘం మహిళా విభాగం నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బంటు కవిత, పద్మ, అనసూయ, వజ్రమ్మ పాల్గొన్నారు.

హాలియా: హాలియా మునిసిపాలిటీ పరిధిలో మతిస్థిమితం లేని, యాచకులకు దుప్పట్లను ఎమ్ఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మందా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ చలితీవ్రత వల్ల ఇబ్బంది పడుతున్న వారికి దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాజేష్, నరేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

హాలియా: రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి మాతృమూర్తి రాములమ్మ ఇటీవల మృతి చెందగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి యాదగిరి నివాసంలో ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఎంపీపీలు సుమతి, భగవాన్‌నాయక్, అనురాధ ఉన్నారు.

మిర్యాలగూడ అర్బన్: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లు గౌతమ్‌రెడ్డి, పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అభయహస్తం పేరిట స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వీరాచారి, రాంమ్మూర్తి, రామచంద్రం, శివ, రాజు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం వెలిమినేడులో అయ్యప్పస్వామి మాల ధరించిన వారు శబరిమలయాత్రకు పయనంకాగా వారికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు అంతటి పారిజాతనర్సింహ సన్మానించారు.

చింతపల్లి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో పార్లమెంట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, బుడిగ వెంకటేష్ పిలుపు నిచ్చారు. శనివారం చింతపల్లి మండలకేంద్రంలో పార్లమెంట్ ముట్టడి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివ, శ్రీధర్, అఖిల, శైలజ, గీతిక, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హాలియా: హాలియాలోని ఇబ్రహీంపేట 1వ వార్డుకు చెందిన బాబు కుమారుడు మహ్మద్ జావిద్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కాలికి ఆపరేషన్ అయింది. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి జావిద్‌ను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం వెలిమినేడులో ఇండస్ట్రియల్ పార్క్‌ను రద్దు చేయాలని, సేకరించిన భూములను రైతులకు చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని వెలిమినేడు మండల సాధన సమితి అధ్యక్షుడు పోలగోని శివప్రసాద్ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులో ఇండస్ట్రియల్ పార్క్ వల్ల రైతులు భూములు కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాల్లో కూడా మార్పులు తీసుకువచ్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నాగార్జునసాగర్: అయోధ్యలో రామాలయం అక్షింతలు కెనాల్స్ హనుమాన్ దేవాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని దివాళా తీసింది

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్


నర్సయ్యగౌడ్

మర్రిగూడ, జనవరి 6: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని దివాళా తీసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలుచేయడం అసాధ్యమని భువనగిరి పార్లమెంట్ మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శనివారం మర్రిగూడ ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. చర్లగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టుల్లో భూములు, గ్రా మాలు కోల్పోయిన బాధిత ముంపు భూనిర్వాసితులకు పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పించి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశంలో సుస్థిరపాలన బీజేపీతోనే సాధ్యమని అన్నారు. ఆయన వెంట సమావేశంలో మాజీ సర్పంచులు రాజు నాయక్, లాలునాయక్, యాదగిరి, రాజేందర్‌నాయక్, నర్సింహ, గ్యార గోపాల్, కిషోర్, రాజుగౌడ్, పరమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.